డయాలసిస్ సెంటర్ సిద్ధం

27న ప్రారంభం

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాక
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ముస్తాబైంది. ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం నిర్ణయించారు. ఈ సెంటర్ పరిధిలో సుమారు 40 మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. వీరంతా ఖమ్మం, కొత్తగూడెం వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారం రోజుల క్రితం సుభాష్‌నగర్‌కు ఎలగందుల కళావతి డయాలసిస్‌తో కొత్తగూడెంలో మృతి చెందింది. ఈ ప్రాంతానికి చెందిన రోగుల కోసం ఆరు నెలల క్రితం ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్ సెంటర్ మంజూరయింది. అయితే వివిధ కారణాలతో పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. డయాలసిస్ ఏర్పాట్లు పూరైనా అతిథుల కోసం వేచి చూస్తున్నట్లు ప్రచారం సాగింది. మంత్రి కేటీఆర్ కోసం వేచి చూడగా.. వివిధ కారణాలతో ఇప్పుడు వచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ ఖమ్మంలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి ఇల్లెందులో ఈ నెల 27న జరుగు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు ఆహ్వానించిన విషయం విధితమే. ఇదే తరుణంలో డయాలసిస్ సెంటర్‌ను మంత్రి పువ్వాడ చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ నెల 27న ప్రారంభిస్తున్నట్లు వెల్లడి కావటంతో డయాలసిస్ రోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. డయాలసిస్ కోసం ఆస్పత్రిలో ఒక గదిని కేటాయించగా.. అందులో మిషనరీ లైట్లు, ఫ్యాన్లు, మంచాలు, ఏసీలు, డ్రైయినేజీ నిర్మాణం, ట్యాంకులు, జనరేటర్, బ్యాటరీలు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం డయాలసిస్ రోగులు ఖమ్మం, కొత్తగూడెం వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒక్కొక్కరు సుమారు రూ.10 వేల – రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇల్లెందు, మణుగూరులకు డయాలసిస్ సెంటర్లు మంజూరు కాగా ఈనెల 24న అక్కడి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రేగా కాంతారావు డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇల్లెందులో కూడా ఈ నెల 27న సాయంత్రం 4 గంటలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే హరిప్రియ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించనున్నారు.

బ్లడ్ బ్యాంక్ ఏదీ..?

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో శస్త్రచికిత్సలు కూడా జరుగుతున్నాయి. వీటికి అనుగుణంగా రక్త నిధి కేంద్రం కూడా అందుబాటులో ఉండాలి. దీని ఏర్పాటు కోసం టెండర్‌కు ఆహ్వానం పలికారు. కానీ ఇంకా ఎవరూ రాలేదు. కేంద్రం పనులు ప్రారంభం కావాల్సి ఉంది.

అప్‌గ్రేడ్ అయినా సమస్యలే...

ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్ అయినా సమస్యలు మాత్రం సమసిపోలేదు. ఆస్పత్రి ఆవరణలో మంచినీరు లేక రోగులు అల్లాడుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ పని చేయక మూలకు పడింది. అంతేగాక కూర్చునేందుకు సరిపడా బల్లలు లేవు. వేసవికాలంలో ఉక్కపోతకు తగినన్నీ ఫ్యాన్లు లేవు. విద్యుత్ లోడు అధికం కావటం వల్ల కరెంటు ట్రిప్ అవుతోంది. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తే ఈ ప్రాంత పేదలకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది.



డయాలసిస్ సెంటర్

అన్ని పనులూ పూర్తయ్యాయి..



మణుగూరు తరహాలో ఇల్లెందు డయాలసిస్ కేంద్రం కూడా అంతా సిద్ధంగా ఉంది. ఈ నెల 27న ప్రారంభించేందుకు వైద్యారోగ్యశాఖ రెడీగా ఉంది. అన్ని ఏర్పాట్లు చేశాము. మూడు ఏసీలు అమర్చాల్సి ఉంది. ఒక్కరోజులో పూర్తవుతుంది. రోగులకు సేవలు అందించేందుకే ఈ సెంటర్ ఏర్పాటు చేశాము.

– డాక్టర్ రవిబాబు నాయక్, డీసీహెచ్‌ఎస్, భద్రాద్రి కొత్తగూడెం

క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: పేదింటి ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి పథకం వరం అని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా స్వగృహంలో 33 మంది లబ్ధిదారులకు సుమారు రూ.33 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా ఉండాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, కాల్వ ప్రకాశ్, బరపటి ప్రసాద్, కనగాల బాలకృష్ణ, తహసీల్దార్ రంగా ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన



వైష్ణవి, సానియా కౌసర్‌ను అభినందిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అనుదీప్ సత్కరించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరంలో వైష్ణవి 493/500, ద్వితీయంలో సానియా కౌసర్ 982/1000 మార్కులు సాధించారు. వీరిని కలెక్టర్ ఘనంగా సత్కరించి అభినందించారు. మాట్లాడుతూ.. మన ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని, అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి సులోచనారాణి, ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, అధ్యాపకులు ఉన్నారు.

ఘనంగా విక్టరీ డే



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న వీరయ్య, హరిబాబు

పాల్వంచ పట్టణంలో స్వేరోస్ ఆధ్వర్యంలో గురువారం విక్టరీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర కార్యదర్శి చిలకబత్తిని వీరయ్య, జిల్లా అధ్యక్షుడు టి.హరిబాబు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వేరోస్ అయిన పూర్ణ ఆనంద్ ఎవరెస్ట్ ఎక్కిన రోజును విక్టరీ డేగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అక్షరం, ఆర్థికం, ఆరోగ్యమే ప్రధాన ఎజెండాగా తీసుకుని స్వేరోస్ నెట్‌వర్క్‌ని గల్లీగల్లీకి తీసుకెళ్తామని, పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రధాన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో జీవీ రావు, లోకేశ్, నాగేంద్ర బాబు, తేజ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

టేకులపల్లి: టేకులపల్లి మండలం మద్రాస్‌తండా గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ మాళోతు రాజేందర్‌నాయక్ ప్రారంభించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మద్రాస్‌తండా పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. వారికి కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి పరీక్షల శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 31 వరకు కంటి వైద్య పరీక్షలు జరుగుతాయని అందరూ సకాలంలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మంగీలాల్, ఉప సర్పంచ్ సర్ప నరసింహారావు, కంటి వెలుగు వైద్యాధికారి రూపాచంద్, ఆప్తాలమిస్ట్ ఆఫీసర్ సనత్‌కుమార్, దివ్య, సూపర్‌వైజర్ వీసం శకుంతల, వెంకటరమణ, ఆశా కార్యకర్తలు కళావతి, నిర్మల, సునీత, జ్యోతి, అచ్చమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం షాలేమురాజు

ఇల్లెందు: తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేమురాజు సింగరేణి అధికారులను కోరారు. గురువారం ఇల్లెందులోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏరియాలోని గనులు, విభాగాల అధిపతులతో మాట్లాడుతూ.. జూన్ 2న ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కోరారు. తొలి రోజున అన్ని డిపార్ట్‌మెంట్లలో జెండా ఆవిష్కరణలు జరపాలని సూచించారు. మామిడి, కొబ్బరి తోరణాలతో అలంకరించాలని, రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని కోరారు. పరుగు పందెంలో ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు. స్టాల్స్ ఏర్పాటు చేసి తెలంగాణ రుచులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సంబురాలు అంబరాన్ని తాకేలా ఉండాలని కోరారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాసు, ఏజీఎం గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, రామచంద్ర, దిలీప్‌కుమార్, డాక్టర్ మల్లారెడ్డి, సుధాకర్, అంజిరెడ్డి, శ్రీహరి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఎమ్మెల్యేలు రాజీనామా చేయాల్సిందే..



ఆందోళన చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఇల్లెందు: ఎస్టీ జాబితాలో 11 బీసీ ఉపకులాలను విలీనం చేస్తూ అసెంబ్లీ తీర్మానం ప్రవేశపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని, తక్షణమే ఆ తీర్మానాన్ని రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం ఇల్లెందులో ఆదివాసీ సంఘాల జేఏసీ నేతలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశ మూల నివాసులైన ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలను చరిత్రను కాపాడుతున్నారని వారి మనుగడను దెబ్బ తీసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 30 లక్షల జనాభా కలిగిన 11 బీసీ కులాలైన వాల్మీకి బోయ, ఖైతి లంబాడీ, పెద్ద బోయ, బేదర్, కిరాతక, నిషాదీ, తలయారీ లాంటి 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపారని తెలిపారు. దీనిని అసెంబ్లీలో ఉన్న 12 మంది ఎస్టీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించకపోవటం దుర్మార్గమన్నారు. దీని వల్ల ఆదివాసీ మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ఈ ఆందోళనలో ఆదివాసీ జేఏసీ నేతలు బాలకృష్ణ, ధనసరి రామ్మూర్తి, కె.బుచ్చయ్య, ఈసం నర్సింహారావు, డి.వీరభద్రం, ఈసం కృష్ణ, ఈసాల రామచందర్, పూనెం ధర్మయ్య, నాగేందర్, వెంకటయ్య, మంగయ్య, నాయిని రాజు, కాంపాటి పృథ్వీ, బుర్ర వెంకన్న పాల్గొన్నారు.

కబ్జా స్థలాన్ని ఇప్పించండి



మాట్లాడుతున్న శ్రీలత, కుటుంబసభ్యులు

ఇల్లెందురూరల్: ప్రభుత్వం సరెండర్ నక్సలైట్ కోటాలో తమ కుటుంబానికి మంజూరు చేసిన ఇంటి స్థలం కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని ఇప్పించాలని కోరుతూ బాధితులు గురువారం తహసీల్దార్ కృష్ణవేణిని ఆశ్రయించారు. బాధితురాలు బొల్లి శ్రీలత విలేకరులతో మాట్లాడుతూ.. 2002లో లొంగిపోయిన తన భర్త దేవరాజుకు పునరావాసం కింద 2004లో అప్పటి ప్రభుత్వం సుభాష్‌నగర్‌లో సర్వే నెంబర్ 603లో మూడు గుంటల ఇంటి స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు.

ఈ స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేస్తున్నాడని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు. దీంతో కోర్టును ఆశ్రయించామని కానీ, వారు తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి కోర్టుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమకు గతంలో కేటాయించిన స్థలాన్ని చూపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు సాత్విక్, సాస్వాంత్, గొగ్గెల రాములమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాజమల్లుకు కాంగ్రెస్ నాయకుల నివాళి

ఇల్లెందు: సింగరేణి కార్మిక వర్గంలో, ఇల్లెందు పట్టణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఇల్లెందు మాజీ మున్సిపల్ చైర్మన్, ఐఎన్‌టీయూసీ నేత చొప్పరి రాజమల్లు ప్రజల పక్షపాతి అని ఆయన ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త పాటుపడాలని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఇల్లెందులోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద జరిగిన సంతాప సభలో ఆయన రాజమల్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. రాజమల్లు సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు డానియేల్, సైదులు, గింజల నర్సిరెడ్డి, వెంకట ప్రవీణ్ నాయక్, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, కొండూరి చిన్నా, శంకర్ నాయక్, సుదర్శన్‌కోరీ, జీవీ వీరభద్రం, జలీల్, ఇస్లావత్ లక్ష్మణ్‌నాక్ తదితరులు రాజమల్లుకు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం



నిరుద్యోగ మార్చ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

చుంచుపల్లి: రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే వాటిని భర్తీ చేయకుండా కేసీఆర్ ప్రభుత్వం యువతకు తీవ్ర అన్యాయం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ రాకేష్‌రెడ్డి విమర్శించారు. భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో ప్రభుత్వ అసమర్థత వల్లనే ప్రశ్నపత్రం లీక్ అయిందన్నారు. యువతకు భరోసా కల్పించడం కోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. దానిలో భాగంగా ఈనెల 27న ఖమ్మంలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ మార్చ్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పూకె అబ్బయ్య, శ్రీనివాస్ కుమార్, సీతారాంనాయక్, ఆకుల నాగేశ్వరరావు, ఏనుగుల వెంకటరెడ్డి, మునుగు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శానిటేషన్‌పై ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. రాబోయే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాలులో గురువారం మేరీ లైఫ్ ప్రతిజ్ఞను రిసోర్స్ పర్సన్స్, శానిటేషన్ సిబ్బందితో చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రతీ ఇంట్లో ఉపయోగించని వస్తువులను వార్డులలో ఉన్న రీసైక్లింగ్ సెంటర్ల ద్వారా సేకరించి, వాటిలో ఉపయోగపడే వస్తువులను అవసరం ఉన్న ప్రజలకు అందజేయాలని, మిగిలిన వాటిని రీసైక్లింగ్‌కు తరలించాలని సూచించారు. కొత్తగూడెం మున్సిపాలిటీని పారిశుద్ధ్య విభాగంలో అగ్రభాగాన నిలపడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణాన్ని పరిరక్షిస్తే భవిష్యత్ తరాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. 36 వార్డులలో తడి, పొడి చెత్త బుట్టల పంపిణీ జరిగిందని చెప్పారు. ప్రజలు పంపిణీ చేసిన చెత్తబుట్టలలో ప్రతిరోజూ తడిపొడి చెత్తను వేర్వేరుగా అందించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా మెప్మా సిబ్బంది, ఆర్‌పీలు రుణాల మంజూరు, బకాయి వసూళ్లలో చాలా వెనకబడి ఉన్నట్లు చెప్పారు. వసూళ్లు చేసి సమైక్య సంఘాలను పటిష్టపరచాలని, తద్వారా మహిళలు ఆర్థిక స్థిరత్వాన్ని స్వతహాగా పెంపొందించుకునేవిధంగా ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంసీ రాజేష్, టీఎంసీలు నాగయ్య, వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అశోక్ చౌహాన్, వీరభద్రచారీ, సీఓలు సరిత, శాంతకుమర్, మౌలాలీ, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రజాగర్జన వాల్ పోస్టర్లు విడుదల



సూపర్‌బజార్(కొత్తగూడెం): మాట్లాడుతున్న సాబీర్‌పాషా



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యలే పరిష్కారంగా జూన్ 4న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే ప్రజాగర్జన సభ విజయవంతం కోసం ఇంటింటికి సమాచారాన్ని అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రజాగర్జన ప్రచార జీప్ జాతాను గురువారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాసరెడ్డి, కంచర్ల జమలయ్య, గెద్దాడ నగేష్, కె.రత్నకుమారి, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, సీహెచ్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: జూన్ 4 కొత్తగూడెంలో జరగనున్న ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు పిలుపునిచ్చారు. పార్టీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిచంఆరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంపదను దుర్వినియోగం చేస్తూ కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలోని ప్రజలకు రక్షణ కరువైందని, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొత్తగూడెం కేంద్రంగా నిర్వహించతలపెట్టిన ప్రజాగర్జన సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, కొమారి కృష్ణ, వీర్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫాగింగ్

ఇల్లెందురూరల్: దోమల నియంత్రణే లక్ష్యంగా మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో గురువారం ఫాగింగ్ పనులు ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో యంత్రం సహాయంతో ఫాగింగ్ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ చాట్ల భాగ్యమ్మ, ఎంపీటీసీ పూనెం లింగమ్మ మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభానికి ముందే దోమల నియంత్రణకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. వీధులలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు దోమల ఉత్పత్తిని నియంత్రించేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్పీతోనే మహిళాభివృద్ధి సాధ్యం



నియామకపత్రాన్ని అందజేస్తున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే ప్రతీ ఎన్నికల్లో మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఉంటారని, బీఎస్పీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. గురువారం స్థానిక ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ హాల్‌లో జరిగిన బీఎస్పీ మహిళా విభాగం కార్యకర్తల సమావేశానికి కామేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత బీఎస్పీ అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలిగా కేతిని కుమారిని నియమించి, ఆమెకు నియామకపత్రం అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందంజలో ఉన్నారన్నారు. మహిళా శక్తిని ఎట్టి పరిస్థితుల్లో తక్కువ చేసి చూడొద్దని తెలిపారు. మద్యపాన ఉద్యమంలో మహిళలు చేసిన పోరాటం తెలుగు రాష్ట్రాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీ గెలుపు కోసం మహిళలు కంకణం కట్టుకోవాలన్నారు. మహిళలు తలుచుకుంటే ప్రభుత్వాలను కూల్చడం పెద్ద పని కాదని ఇది చరిత్ర చెప్పిన వాస్తవం అన్నారు. కార్యక్రమంలో బండి రమణి, కోలా మల్లిక, నాగుల రవికుమార్, మాలోత్ వీరునాయక్, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, ఎర్రంశెట్టి రాజేశ్వరి, మాలోత్ భానుమతి, గుంజ సరోజ తదితరులు పాల్గొన్నారు.

29న ఆలయ నిర్మాణానికి భూమి పూజ

టేకులపల్లి: కోయగూడెం గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించనున్నారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. కోయగూడెం అయ్యప్ప భక్తబృందం ఆధ్వర్యంలో కోయగూడెం గ్రామంలో ఈ నెల 29న ఆలయ నిర్మాణానికి శిలాస్థాపన, భూమిపూజ కార్యక్రమాన్ని కేరళ తంత్రి మాధవన్ నంబూద్రి చేత నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజ, 11 గంటలకు శిలాస్థాపన, భూమిపూజ జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్‌ఐ

పాల్వంచరూరల్: తహసీల్దార్ కార్యాలయంలో పట్టణ ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న భిక్షమయ్య కొత్తగూడెం ఆర్‌డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆర్‌డీఓ నుంచి రవికుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించినట్లు గురువారం తహసీల్దార్ రంగాప్రసాద్ తెలిపారు.

రెస్టారెంట్లలో తనిఖీ

పాల్వంచ: పట్టణంలోని రెస్టారెంట్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టమర్లకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని చెప్పారు. గడువు ముగిసిన పదార్థాలను వాడొద్దని చెప్పారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూఆక్రమణను అడ్డుకున్న అధికారులు

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్‌లో సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని సింగరేణి సెక్యూరిటీ అధికారులు హెచ్చరించారు. ఖాళీ స్థలంలో గురువారం గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని స్థానిక పోలీసుల సహాయంతో అడ్డుకున్నారు. అప్పటికే వేసిన గుడిసెలను తొలగించారు. సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో పోలీసులు, ఎస్‌అండ్‌పీసీ అధికారులు బందోబస్తు నిర్వహించి గుడిసెలు వేయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన బొగ్గు లారీ



పడిపోయిన ద్విచక్రవాహనం

ఇల్లెందు: ఇల్లెందు – కారేపల్లి బైపాస్ రోడ్డులో లలిత కళామందిర్ వద్ద ఓ బైక్‌ను వేగంగా వచ్చిన బొగ్గు టిప్పర్ ఢీ కొట్టింది. బైక్ మీద ఉన్న షేక్ ఖాజామొయినుద్దీన్, అతని భార్య సుల్తానా, కుమార్తె మన్నా ఖతూన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు లారీని నిలిపివేసి క్షతగాత్రులను ఇల్లెందు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించి ఖమ్మానికి రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..



రాళ్లవాగు కల్వర్టు ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని ఉలవనూరు వైపు వెళ్లే ప్రధాన మార్గంలోని మందెరకలపాడు గ్రామ సమీపంలోని రాళ్లవాగు కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చి వేయాలని కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : వంశీ, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నెంబర్: 9603465426